
తెలుగు దిన పత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

నిజం..నిర్భయంగా

గ్రేటర్ -హైదరాబాద్

బుధవారం, జూన్ 10, 2026





## నిజాంపేట డంపింగ్ యార్డును 30 రోజుల్లోగా తరలిస్తాం

### రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**అక్షర గళం, కుత్బుల్లాపూర్:** నిజాంపేట డంపింగ్ యార్డును 30 రోజుల్లోగా తరలిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

మిగతా.. 2లో



## తెలంగాణ ఉద్యమ చరిత్రలో అందెశ్రీది ప్రత్యేక స్థానం

### సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**అక్షర గళం, ఘట్కేసర్:** తెలంగాణ ఉద్యమ చరిత్రలో అందెశ్రీది ప్రత్యేక స్థానం అని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పక్కన ఏర్పాటు చేయనున్న 'అందెశ్రీ స్మృతి వనం' స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని తన కలంతో ప్రజల్లో

మిగతా.. 2లో

## ఐఐఐటీ జంక్షన్ - డీఎల్ఎఫ్ కారిడార్ రహదారి అభివృద్ధి పనులను పరిశీలించిన సైబరాబాద్ సీపీ

**అక్షర గళం, గచ్చిబౌలి:** గచ్చిబౌలి పరిధిలోని ఐఐఐటీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న రహదారి అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు



తీసుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అధికారులకు సూచించారు. గచ్చిబౌలి పరిధిలోని ఐఐఐటీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న రహదారి అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులను మంగళవారం శేర్లింగంపల్లి ఏడీసీపీ హనుమంతరావు, సిఎంసి అధికారులతో కలిసి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ నుండి డీఎల్ఎఫ్ జంక్షన్ వరకు చేపడుతున్న ఫ్లైఓవర్, రహదారి విస్తరణ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు కలిగే ఇబ్బందులను తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలు, ట్రాఫిక్ నిర్వహణ, ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటుపై అధికారు లతో చర్చించారు. అనంతరం సైబరాబాద్ సీపీ అధికారులు తో మాట్లాడుతూ నిర్మాణ పనుల దృష్ట్యా రాబోయే మూడు నెలల పాటు ప్రత్యేక ట్రాఫిక్ అడ్వైజరీ అమలు చేసి, అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని కోరారు. రహదారి అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం గచ్చిబౌలి–డీఎల్ఎఫ్ మార్గంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ సురేష్, సిఎంసి అధికారులు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సీఎం బహిరంగ సభ విజయవంతంతో ఎమ్మెల్యేకు సన్మానం

**అక్షరగళం, శేరిలింగంపల్లి:** మియాపూర్‌లో జరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ ను పెద్ద ఎత్తున విజయవంతం చేసిన సందర్భంగా మంగళవారం తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాస్, ఉప్పలపాటి శ్రీకాంత్ లు శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ని కలిసి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సుమారుగా రూ. 2000 కోట్ల రూపాయలతో మియాపూర్ చౌరస్తా ఫ్లై ఓవర్ , సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ప్రధాన కార్యాలయం , ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి స్వాగతం సుస్వాగతం. నా తరుపున, శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలియచేస్తున్నానని అన్నారు. సభను విజయవంతం

మిగతా.. 2లో



## కాంగ్రెస్ ముఖ్యమంత్రులు శేరిలింగంపల్లిని అభివృద్ధి చేశారనడం హాస్యాస్పదం

### ◆ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు

**అక్షరగళం, శేరిలింగంపల్లి:** కాంగ్రెస్‌కు సంబంధించిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ఆర్, ప్రస్తుత కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శేరిలింగంపల్లి నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యే గాంధీ అన్నడం హస్య స్పందంగా ఉందని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులతో కలిసి మాట్లాడుతూ సోమవారం మియాపూర్ లో జరిగిన బహిరంగ సభలోశాసనసభ్యులు అరికెపూడి గాంధీ బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, మున్సిపల్ శాఖ మాత్యులు కేటీఆర్ దాదాపు 9,500 కోట్ల రూపాయలతోటి అభివృద్ధి చేశారని తన ఎలక్షన్లలో కరపత్రిక పాంప్లెంట్ ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి ఓటు వేసి గెలిపించమని అడిగి గెలిచి ఈరోజు కేసీఆర్ పేరు,

మిగతా.. 2లో



# దళితుల హక్కులకు భంగం కలిగించే ఎలాంటి చర్యలనైనా ప్రభుత్వం ఉపేక్షించబోము

### రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి:** దళితుల హక్కులకు భంగం కలిగించే ఎలాంటి చర్యలనైనా ప్రభుత్వం ఉపేక్షించదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని గుండ్లపోచంపల్లి శివారులో ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరితో కలిసి మంత్రి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 1991లో గుండ్లపోచంపల్లి శివారు సర్వే నంబర్ 509లోని 49 ఎకరాల 20 గుంటల భూమిని దళిత విద్యార్థుల సంక్షేమం, శిక్షణా కార్యక్రమాల కోసం ఎస్సీ కార్పొరేషన్‌కు కేటాయించారని తెలిపారు. దళిత విద్యార్థుల భవిష్యత్తు కోసం కేటాయించిన ఒక్క గజం భూమిని కూడా కబ్జా చేసేందుకు ఎవరినీ అనుమతించ బోమని అన్నారు. తెలంగాణకు చెందిన ఎస్సీ విద్యార్థులకు ఉద్యా నవన శిక్షణ అందించేందుకు ఉద్దేశించిన ఈ విలువైన భూమిని పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూములను కొందరు ప్రైవేట్ వ్యక్తులు గత ప్రభుత్వ అండదండలతో, ఆర్థిక బలాన్ని ఉపయోగించి అన్యాక్రాంతం చేస్తున్నారని ఆరోపించారు. 49 ఎకరాల 20 గుంటల భూమికి సంబంధించి సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక అందిన వెంటనే పూర్తిస్థాయిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రకటించారు.”అన్యాక్రాంతం చేస్తున్న వారిలో ఎంత పెద్దవారు ఉన్నా సహించేది లేదని, ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని రక్షిస్తాం” అని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఈ అంశాన్ని సుమోటోగా తీసుకుని వెంటనే సర్వే నిర్వహించాలని, హద్దురాళ్లు, గేట్లు ఏర్పాటు చేసి భౌతిక స్వాధీన స్థితిపై నివేదిక అందించాలని ఆదేశించారు. అనంతరం భూమిని పూర్తిస్థాయిలో ఎస్సీ కార్పొరేషన్ ఆధీనంలోకి తీసుకొస్తామని తెలిపారు.ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధిగా బాధ్యతతోనే తాను ఇక్కడికి వచ్చానని పేర్కొన్న మంత్రి, దళితుల ఆస్తులను కాపాడటంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదన్నారు. బెదిరింపులు, ఒత్తిళ్లు, రాజకీయ ప్రభావాలకు ప్రభుత్వం భయపడదని, మాటల్లో కాదు చేతల్లో చూపిస్తామని హెచ్చరించారు. “దళిత విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించడమే మా లక్ష్యం. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ఈ 49 ఎకరాల 20 గుంటల భూమి సాధారణ ఆస్తి కాదు. దీనిని కాపాడటం సామాజిక బాధ్యత” అని మంత్రి పేర్కొన్నారు.ఎస్సీ, ఎస్టీల భూముల విషయంలో ఎవరైనా చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయడానికీ ప్రభుత్వం వెనుకాడదని స్పష్టం చేశారు. “49 ఎకరాల 20 గుంటల్లో ఒక్క గజం భూమి పోయినా చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది” అని హెచ్చరించారు.అదే సమయంలో ఆ ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్న రైతుల ప్రయోజనాలను కూడా పరిరక్షిస్తామని తెలిపారు.

రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు అవసరమైన దారులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎవరైనా రైతులను అడ్డుకునేందుకు ప్రయత్నించినా, తమ ప్రభావాన్ని చూపాలని భావించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ అంశంపై రాష్ట్ర రెవెన్యూ మంత్రికి కూడా నివేదిక సమర్పించి భూముల రక్షణకు అవసరమైన చర్యలు వేగవంతం చేస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, వీసీ అండ్ ఎండీ హనుమంత్ నాయక్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి బి. శ్రీధర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బి. శంకర్, మేడ్చల్ ఆర్డీవో శ్యాంప్రసాద్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పద్మజ, మేడ్చల్ తహసీల్దార్ (ఇన్‌చార్జి) అనూష తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ముఖ్యమంత్రులు శేరిలింగంపల్లిని అభివృద్ధి చేశారనడం హాస్యాస్పదం

మొదటిపేజీ తరువాయి..

కేటీఆర్ పేరు చెప్పకుండా మీరు ప్రతిపక్షంలో ఉన్నామని చెప్పడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. 2014 ముందు శేర్లింగంపల్లి నియోజకవర్గం ఎలా ఉండే 2014 తర్వాత ఫ్లై ఓవర్లు అండర్పాస్ రోడ్లు' లింక్ రోడ్లు' ఇలా ఎన్నో చేసి ట్రాఫిక్కు లేకుండా చేయడం మీకు తెలియదా అని ప్రశ్నించారు. దాదాపు 3500 మందికి ఎంతో విలువైన డబల్ బెడ్ రూమ్లు ఇచ్చిన మాట మీకు తెలియదా మీరు దాదాపు రెండు సంవత్సరాల క్రితం రేవంత్ రెడ్డి తో కలిసి అభివృద్ధి చేస్తామని చెప్పి కాంగ్రెస్ కండువా కప్పుకున్న మాట నిజం కాదా రెండు సంవత్సరాలు తర్వాత ఈరోజు శంకుస్థాపనలు పెట్టి ఏదో చేసామని చెప్పుకోవడం కరెక్ట్ కాదన్నారు. బిఆర్ఎస్ పార్టీ గనుక అధికారంలోకి వచ్చి ఉంటే ఈరోజు మీరు ఏవైతే శంకుస్థాపన చేసినారో అవన్నీ కూడా ప్రారంభోత్సవాలుగా జరిగేవన్నారు. కెసిఆర్ గెలిచిన ఎమ్మెల్యేలు అందరికంటే మీకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ విప్ చేయడం వాస్తవం కాదా ఇప్పటికైనా మీరు ప్రతిపక్షంలో ఉన్నామని అనుకుంటే బిఆర్ఎస్ భవన్ కి రండి కండువా వేసుకోండి కాంగ్రెస్ ప్రభుత్వం ఏవైతే ప్రజలకి వాగ్దానాలు చేసి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందో అవన్నీ కూడా బిఆర్ఎస్ పార్టీ కండువా వేసుకొని మాతో కలిసి పోరాటం చేయాలని లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నామని అనుకుంటే శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి ఎలక్షన్స్ కి వెళ్లి గెలిచి నాలుగోసారి ఎమ్మెల్యే అని చెప్పుకోవాల్సిందిగా అన్నారు. ఈవన్ని ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయములో ప్రజలు గుణ పాఠం చెపుతారని అన్నారు.

# తెలంగాణ ఉద్యమ చరిత్రలో అందెశ్రీది ప్రత్యేక స్థానం

మొదటిపేజీ తరువాయి..

రగిలించిన మహాకవి, ప్రజా గాయకుడు, రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ స్మృతిని చిరస్థాయిగా నిలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. తన గీతాలు, రచనల ద్వారా తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అందెశ్రీ సేవలకు గుర్తింపుగా ఈ స్మృతి వనాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.ఘట్కేసర్‌లో ప్రభుత్వం ఎకరం 22 గుంటల భూమిని ఇందుకోసం కేటాయించిందని మంత్రి వెల్లడించారు. ఇది కేవలం ఒక ఉద్యానవనం మాత్రమే కాకుండా, తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే స్మారక క్షేత్రంగా రూపుదిద్దుకోనుందని చెప్పారు. అందెశ్రీ జీవిత విశేషాలు, ఉద్యమంలో ఆయన పాత్ర, సాహిత్య సేవలను భావితరాలకు చేరవేసే విధంగా స్మృతి వనాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రను, ఉద్యమ స్ఫూర్తిని యువతకు పరిచయం చేసే జ్ఞాపక చిహ్నంగా ఈ ప్రాంగణం నిలవాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ... స్మృతి వనం అభివృద్ధి కోసం ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.4 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం స్మృతి వనాన్ని నిర్వహణ కోసం హెచ్ఎండీఏకు అప్పగించనున్నట్లు చెప్పారు. స్మృతి వనంలో అందెశ్రీ విగ్రహం, ఆయన జీవిత చరిత్రను ప్రతిబింబించే శిలాఫలకాలు, తెలంగాణ ఉద్యమ గీతాల ప్రదర్శన గ్యాలరీ, సాహిత్య వేదిక, పచ్చదనంతో కూడిన ప్రత్యేక ఉద్యానవనం, సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని గీతంగా మలిచిన మహాకవి అందెశ్రీకి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ గౌరవం, తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుందన్నారు.

# నిజాంపేట డంపింగ్ యార్డును 30 రోజుల్లోగా తరలిస్తాం

మొదటిపేజీ తరువాయి..

అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం బాచుపల్లిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ డిగ్రీ కళాశాల నూతన భవన ప్రాంగణం సమీపంలోని డంపింగ్ యార్డును జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరితో కలిసి పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ డంపింగ్ యార్డు కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, ఈ ప్రాంతంలో కొన్ని నిమిషాలు కూడా నిలబడలేని పరిస్థితి ఉందని అన్నారు. ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా డంపింగ్ యార్డు తరలింపు అత్యవసరమైందని అన్నారు. ఈ ప్రాంతంలో రూ.20 కోట్ల వ్యయంతో షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల కోసం ఆధునిక హాస్టల్ నిర్మించామని తెలిపారు. త్వరలో గురుకుల విద్యార్థులు ఇక్కడికి రానున్న నేపథ్యంలో పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. వేలాది మంది డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు, స్థానిక కాలనీవాసులు, భవిష్యత్తులో ఇక్కడ విద్యనభ్యసించనున్న గురుకుల విద్యార్థులకు ఇబ్బందిగా మారిందన్నారు. కాలనీవాసులు తమ సమస్యలను వివరించగా బాధ కలిగిందని, గతంలో చిన్నారిపై కుక్కల దాడి జరిగిన ఘటన ఎంతో విషాదకరమని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు పరిసరాలు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్నాయన్న ప్రజల ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు.డీసీపీతో మాట్లాడి ప్రత్యేక పెట్రోలింగ్ వాహనం ఏర్పాటు చేయాలని సూచిస్తానని, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశిస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.గతంలో డంపింగ్ యార్డు తరలింపుపై కలెక్టర్‌కు పలు ఫిర్యాదులు అందాయని, ప్రత్యేక కార్పొరేషన్ల ఏర్పాటు ప్రక్రియ కారణంగా కొంత ఆలస్యమైందని చెప్పారు. అయితే ప్రస్తుతం అన్ని శాఖల సమన్వయంతో వేగంగా చర్యలు చేపట్టి నెల రోజుల్లో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని వెల్లడించారు. “గురుకుల విద్యార్థుల సంక్షేమం, ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రమైన పరిసరాలే ప్రభుత్వ ప్రాధాన్యత” అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పునరుద్ఘాటించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థ భవన నిర్మాణం పూర్తయిందని, అయితే డంపింగ్ యార్డు ముందునుంచే ఉండటంతో విద్యార్థులు, స్థానికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించామని, కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసి డంపింగ్ యార్డును త్వరితగతిన తరలిస్తామని చెప్పారు.

# సీఎం బహిరంగ సభ విజయవంతంతో ఎమ్మెల్యేకు సన్మానం

మొదటిపేజీ తరువాయి..

చేయడానికి రాత్రి పగలు అనే తేడా లేకుండా అహర్నిశలు కృషి చేసిన నియోజక వర్గ ప్రజలకు, తాజా మాజీ కార్పొరేటర్లకు, నాయకులకు, కార్యకర్తలకు, మహిళ సోదరీమణులకు, అధికారులకు, అనాధికారులకు, అభిమానులకు, శ్రేయభిలాషు లకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రకాంత్, గోపాల్, త్రిమూర్తి రాజు, లింగం, సుధాకర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీయే రక్ష

## బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



**అక్షర గళం, కుత్బుల్లాపూర్:** తెలంగాణ రాష్ట్రం తో పాటు హైదరాబాద్ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీయే రక్ష అని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. మంగళవారం సిఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి బాచుపల్లి చౌరస్తాలో నూతనంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఫ్లై ఓవర్‌ను బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని, నిర్లక్ష్య ధోరణిని ఆయన ఎండగట్టారు. ప్రభుత్వంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన కొట్లాడి అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు కృషి చేసే ఏకైక పార్టీ బిఆర్ఎస్ అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన పనులను ప్రారంభించడం తప్పా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని ఒకటి లేదన్నారు. అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి, అలసత్వాన్ని అసెంబ్లీ వేదికగా పలుమార్లు ప్రశ్నించినందుకే ఈ బాచుపల్లి ఫ్లైఓవర్ పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి ఆగ మేఘాల మీద శంకుస్థాపనలు చేసి ఎక్కడో మియాపూర్ లో ఉంటూ బాచుపల్లి ఫ్లైఓవర్ ను ప్రారంభించడం కుత్బుల్లాపూర్ ప్రజలను అవమానించడమేనన్నారు. ఎస్ ఎన్ డి పి, ఎస్ ఆర్ డి పి పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు హెచ్ - సిటి అంటూ పేరు మార్చడం తప్పా చేసింది ఏం లేదన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తయిన ఇప్పటివరకు సుచిత్ర - కొంపల్లి ఫ్లైఓవర్ పనులను పూర్తి చేయలేక పోయిందన్నారు. బాచుపల్లి ఫ్లైవర్ నిర్మాణంతో పాటు హైదరాబాద్ మహానగర అభివృద్ధి ఘనత బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం నేపాన్ని నెట్టివేసి చేతులు దోచుకుంటున్నారే తప్పా చేసిందేమీ లేదన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం తన ఊహల నగరమైన ఫోర్త్ సిటీని ప్రచారం చేస్తూ ఉన్న నగరాన్ని విస్మరిస్తున్నారని ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ఆగం రాజు, కాసాని సుధాకర్, బాలాజీ నాయక్, చందు ముదిరాజ్, గాజుల సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు సలీం, చంద్రగిరి సతీష్, స్థానిక నాయకులు, మహిళా నాయకురాల్లు తదితరులు పాల్గొన్నారు.



# దాతలు ముందుకు వచ్చి పేద కుటుంబాల దివ్యాంగులకు చేయూతనివ్వండి

### తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ

**అక్షర గళం, కుత్బుల్లాపూర్:** దాతలు ముందుకు వచ్చి పేద కుటుంబాలకు చెందిన దివ్యాంగులకు విద్య, ఉపాధి, వైద్యం, వివాహం వంటి అంశాల్లో ఆర్థిక సహాయం అందించాలని తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ కోరారు. కుత్బుల్లాపూర్‌కు చెందిన దస్తగిరి ప్రమాదంలో తన కుడి కాలును కోల్పోయి గత కొంత కాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నారు.

రోజువారీ పనులు చేసుకోవడంలో కూడా కష్టాలు పడుతున్న ఆయన పరిస్థితిని తెలుసుకున్న తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ వెంటనే స్పందించారు. దస్తగిరికి అవసరమైన సహాయం అందించేందుకు భారత్ వికాస్ పరిషత్ వికలాంగుల పునర్వసతి కేంద్రం ట్రస్టును సంప్రదించి, కృత్రిమ కుడి కాలు (ఆర్టిఫిషియల్ రైట్ లెగ్) అందేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి న్యూ శక్తి దివ్యాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి, జవహర్‌నగర్ బలగంటి సీఈవో చింతల విజయ్ కుమార్, జినుక రఘు ముఖ్య అతిథిగా హాజరై శివకృష్ణ చొరవతో దస్తగిరికి కృత్రిమ కాలు అందజేశారు.

ఈ సందర్భంగా మెరుగు శివకృష్ణ మాట్లాడుతూ సమాజంలో ఇంకా అనేక మంది దివ్యాంగులు సహాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దస్తగిరికి కృత్రిమ కాలు అందడంతో ఆయన జీవితంలో కొత్త ఆశలు చిగురించాయన్నారు. ఇకపై రోజువారీ పనులను మరింత సులభంగా నిర్వహించుకునే అవకాశం లభించిందన్నారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన భారత్ వికాస్ ట్రస్ట్‌కు వికలాంగుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అవసరంలో ఉన్న ప్రతి దివ్యాంగుడికి అండగా నిలవడం మనందరి సామాజిక బాధ్యత అని మెరుగు శివకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి భారత్ వికాస్ ట్రస్ట్ మేనేజర్ నరేంద్ర, సంధ్య, టెక్నీషియన్ రఘు, మధు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఏస్సీ హోదా కల్పించేవరకు పోరాడుతాం

### - మాజీ మంత్రి కొప్పుల, పార్టీ నాయకులు ప్రవీణ్ కుమార్,రాజీవ్ సాగర్ తదితర ప్రముఖులతో కలిసి ఢిల్లీలో జాతీయ విచారణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ బాలకృష్ణన్‌తో ఎంపీ వద్దిరాజు సమావేశం

**ఢిల్లీ:** దళిత క్రైస్తవులకు ఏస్సీ హోదా కల్పించేవరకు తమ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మార్గనిర్దేశనంలో పోరాడుతామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. ఇందుకోసం కాలం చెల్లిన 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించాల్సిన అవసరం ఉందన్నారు.

దళిత క్రైస్తవులకు షెడ్యూల్డ్ క్యాస్ట్ (ఏస్సీ) హోదా కల్పించాల్సిందిగా కోరుతూ ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఐపీఎస్ అధికారి,పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, తెలంగాణ ఫుడ్స్ మాజీ ఛైర్మన్ మేడె రాజీవ్ సాగర్ తదితర ప్రముఖులతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఢిల్లీ జనపథ్ వద్ద ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ లోని జాతీయ విచారణ కమిషన్ కార్యాలయంలో మంగళవారం ఛైర్మన్ జస్టిస్ కే.జీ.బాలకృష్ణన్ తో సమావేశమయ్యారు.

అనంతరం తెలంగాణ భవన్‌లో రవిచంద్ర, ఈశ్వర్, ప్రవీణ్ కుమార్,రాజీవ్ సాగర్ తదితర ప్రముఖులు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ, ఎప్పుడో 75 ఏళ్ల కిందట 1950లో వచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వులను నేడు సవరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దళిత క్రైస్తవులను బీసీ-సీ కేటగిరిగా పేర్కొనడం సరైనది కాదని, సమంజసంగా లేదని, అన్యాయంగా ఉందని,దీనికి సవరణ చేయాల్సిందిగా బీఆర్ఎస్ అధ్యక్షులు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆదేశానుసారం జస్టిస్ బాలకృష్ణన్‌ను కలిసి వివరించామన్నారు.

దళిత క్రైస్తవులను బీసీ-సీ కేటగిరిగా కాకుండా ఏస్సీలుగా గుర్తించాలంటూ కేసీఆర్ నాయకత్వాన అసెంబ్లీలో చర్చించి, ఆమోదం తెలిపి కేంద్ర ప్రభుత్వానికి నివేదించడం గురించి బాలకృష్ణన్ కు వివరించామని ఎంపీ రవిచంద్ర తెలిపారు. తమ ప్రతినిధి బృందం చెప్పిన అంశాలను కమిషన్ ఛైర్మన్ సావధానంగా విన్నారన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో దళితులతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి, అభ్యున్నతికి విశేష కృషి జరిగిందని ఎంపీ రవిచంద్ర చెప్పారు.

కేసీఆర్ దళితులైన ఇద్దరు నాయకులను ఉప ముఖ్యమంత్రులను చేశారని, దళిత బంధు"కు రూపకల్పన చేసి 10లక్షల చొప్పున ఉచిత సాయమందించారన్నారు. మహిళలకు, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ తెలంగాణ తొట్ట తొలి సమావేశాల్లోనే తీర్మానించి కేంద్రానికి సిఫార్సు చేయడాన్ని ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం లేదని, 16మంది కాంగ్రెస్, బీజేపీ లోకసభ సభ్యులు తెలంగాణ ప్రయోజనా



లను గాలికొదిలేశారని ఆయన విమర్శించారు.

జర్మనీ నియంత హిట్లర్ తో పోల్చుకున్న రేవంత్ రెడ్డి క్రిస్టియన్ అయిపోయినట్లా?

మసీదు,చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేసే తాను బీసీని కాకుండా పోతాన? అని ఎంపీ రవిచంద్ర వ్యాఖ్యానించారు. దళిత క్రైస్తవులకు ఏస్సీ హోదా కల్పించాలనే బీఆర్ఎస్ చేస్తున్న డిమాండ్ న్యాయమైనది, ధర్మ మైనదని, ఇది ఒక తెలంగాణకు సంబంధించినది మాత్రమే కాదని, యావత్ దేశానికి చెందిన అంశమని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వాన అహింసా మార్గంలో 14 ఏళ్లు పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, అదే స్ఫూర్తితో పార్లమెంట్ లోపల, బయట దళిత క్రైస్తవుల పక్షాన నిలబడి ఎస్సీ హోదా కల్పించేవరకు మొక్కవోని దీక్షతో బీఆర్ఎస్ ఉద్యమిస్తుందని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.